
సీరియల్ నాటకము:

# రజరాజు



శ్రీ శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి

## మూడో రంగం

రత్నాంగి నగరిలో విశాల మైన వొక నడవ.

అంతటా రత్నకంబళీ పరిచివున్నది.

పార్వతీశిపశ్చర్యా, గంగావతరణమూ, కుమార క్రీడలూ, కిరాతార్జునీయమూ, శివతాండవమూ, మార్కండేయరక్షణమూ, కామదహనమూ, వీరభద్రావిర్భావమూ — ఇలాంటి శివలీలాచిత్రాలతో గోడలన్నీ నిండి వున్నాయి.

కంబళీమీద, అక్కడక్కడ, ఎత్తయిన చక్కని పీటలూ, వాటిమీద నటరాజవిగ్రహాలూ, కుమారవిగ్రహాలూ, గణపతిప్రతిమలూ, నందికేశ్వరవిగ్రహాలూ, మధ్యమధ్య పూలచెట్లకుండ్లూ చక్కగా అమర్చి వున్నాయి.

వసారాలో ముంజూరికి వేలాడుతూ వున్న పంజరంలో మైనగోరువంక ముద్దుముద్దుగా పలుకుతోంది.

ఒకచోట, గోడకి చేర్చి వున్న బాలీసుని ఆనుకుని రత్నాంగి పరుపుమీద కూచుని వుంది.

ఆమె యెదట, కుడిపక్కగా, సారంగధరుడూ, అతనికి కొంచెం యెడంగా సుబుద్ధీ చేతులు కట్టుకుని అలాంటి ఆసనాలమీదే కూచుని వున్నారు.

ఏమి చేమిటో పనులమీద నలుగురైదుగురు పరిచారికలు చాలా అడావడిగా తిరుగుతున్నారు.

***

రత్నాంగి—కోరిన వెంటనే అరవై మంది రాజులు తమ పుత్రికల చిత్రపటాలు పంపా రంటే అది మాకు అసాధారణ మైన ఘనతే; కాని అందరు అందకత్తెలలో వొకామెని యేరి నిర్ణయించడం చాలా కష్టమైన పని. ఎంత నిదానం కలవారి కైనా కళ్లు జిగజిగలాడిపోతాయి. మనస్సు గజిబిజిపడిపోతుంది. బుద్ధి యితికర్తవ్యతామూఢం అయిపోయి, దానిమూలాన, చేసిన పరిశీలన అంతా చివరి కడవిగాసిన వెన్నెల అయిపోవచ్చు.

సుబుద్ధి — తమరు సెలవిప్పించింది అక్షరాలా సత్యం అమ్మగారూ! ఒక రాజ

పుత్రి మాంచి రూపవతి అవుతుంది. ఇంకొక రాజపుత్రి గొప్ప విద్యావతి అవుతుంది. మరొక రాజపుత్రి సుగుణవతి అవుతుంది. ఇలాగ వొక్కొక్క రాజపుత్రి దగ్గిర వొక్కొక్క యోగ్యత యెక్కువగా వుంటుంది. అన్ని లక్షణాలూ వొకచోట వుండడం అసంభవం కనక, కన్యను నిర్ణయించడం సులువైన పని కాదు.

రత్నాంగి — అంతమాత్రమేనా నాయనగారూ? ఎంత లక్షణవతి అయినా ముందు భట్టారకులవారికి నచ్చాలి. తరవాత మహారాజులుంగారికీ నచ్చాలి. వారు చూసే లక్షణాలు వేరు. తుదకెంత సరిపుచ్చుకున్నా కొంచెమో గొప్పో నాకూ నచ్చాలి. నా చూపు వేరు. మహాప్రతిభావంతులు మరిదిగారున్నారు. అత్తయ్యగారి తరవాత అంతటివారు వదినగారున్నారు. వారు కోరే యోగ్యతలు వేరు. మంత్రులున్నారు. వారికిన్నీ తృప్తి కావాలి. అన్నిటికీ మూలం (సారంగధరుడి కేసి చూస్తూ చిరునవ్వుతో) నాయనకి నచ్చాలి. అతని రుచులు వేరు.

[సుబుద్ధి సారంగధరుడి కేసి "యేమంటా"రన్నట్టు చూస్తాడు. సారంగధరుడు సుబుద్ధికేసి "గప్‌చిప్" అన్నట్టు చూసి తల వంచుకుంటాడు.]

రత్నాంగి — (సారంగధరుడికేసి క్రీగంట చూస్తూ) ఇదివరకే అబ్బాయి మనస్సు యే సుందరి మీదయినా నిలిచివుందేమో అదిన్నీ చూసుకోవాలి.

[సుబుద్ధి "చెప్పేస్తా" అన్నట్టు సారంగధరుడి కేసీ, చెప్పడానికి సందేహిస్తున్నట్టు రత్నాంగికేసీ చూసి మొగం వంచుకుంటాడు. రత్నాంగి మందహాసం చేస్తూ సారంగధరుణ్ణీ, సుబుద్ధినీ పరీక్షగా చూస్తూ వుంటుంది. సారంగధరుడు చూపులతో సుబుద్ధిని వారించి మొగం వంచుకుంటాడు.]

రత్నాంగి — (సుబుద్ధితో) నేననుకున్నదే నిజం అయింది. సెలవిప్పించండి.

సుబుద్ధి — (సారంగధరుడికేసి మళ్లీ చూసి, జంకి, మళ్లీ మొగం వంచుకుంటాడు.)

రత్నాంగి — అనుమానిస్తారేమి నాయనగారూ? సెల విప్పించండి.

సుబుద్ధి — (సారంగధరుడికేసి "యిక తప్ప"దన్నట్టు చూస్తాడు.)

సారంగధరుడు — (సుబుద్ధికేసి "వద్దుసుమండీ" అన్నట్టు కొంచెం చురుగ్గా చూస్తాడు.)

రత్నాంగి — (సుబుద్ధితో) తమరెందుకు వెనకాడుతున్నారో నాకు తెలవకుండా వుంది. ఇదివరకే—(అర్ధోక్తి)

సుబుద్ధి — (చేతులు నలుపుకుంటూ) లేదమ్మా, లేదండి.

రత్నాంగి — ఇదివరకే నాయన చూపొక రాజపుత్రిమీద వుండి, యిప్పుడు మేమింకొక రాజపుత్రిని నిరుకుచేస్తే యేమవుతుందో ఆలోచించారా తమరు? కనక, సెలవిప్పించండి. ఇప్పటికే మానాయన వొకామెని వరించి వుంటే నిజంగా ఆమె సర్వలక్షణసంపన్నురాలే అయివుంటుంది. అతను పైపై మెరుగులకు భ్రాంతుడయ్యేవాడు

కాడు. నేను చెప్పుకోడం కాదు; కాని నా కొడుకంతటి యోగ్యుడు దేవలోకంలో కూడా వుండడు. అంచేతే యీవిషయమై నేను చాలా అటమటించిపోతున్నాను. మహారాజులుంగారుకూడా పరిపరివిధాల ఆలోచిస్తున్నారు. కనక, అది అలా జరిగివుంటే — తమకి తెలిసిన్నీ వుంటే వివరంగా సెలవిప్పించండి. తరవాత, అబ్బాయి కోప్పడతాడని తమరు జంకవద్దు. అది సిగ్గు కాని కోపం కాదు.

సారంగధరుడు—(సుబుద్ధి కేసి చూస్తూ) అయ్యవారివాళ యెంచేతో చాలా వింతగా ప్రవర్తిస్తున్నారు. (రత్నాంగితో) తమరూ, బాబయ్యా ఆలోచించి యెలా సెలవిస్తే అలా చెయ్యడానికే నేను నిశ్చయించుకొని వున్నానండీ అమ్మా! ఇందులో అసత్యం యేమీం లేదండీ!

రత్నాంగి — నాయనా! నీమాట యెందు కసత్యం అనుకోవాలీ? నువ్వు, చివరికి మాయిష్టం వచ్చినట్టే చేసినా, పరిపక్వమై వుంది కనక నీమనస్సు కొంత కల్పన సాగించవచ్చు కాదుటోయీ? కాకపోయినా, సుబుద్ధిఅయ్యవా రేదో సెలవిస్తున్నారోయ్!

సారంగధరుడు— చిత్తం చిత్తం, నేనూ సావధానుణ్ణయి వున్నానమ్మా!

రత్నాంగి—(సుబుద్ధితో) సరా ?

సుబుద్ధి — అమ్మా, మూడేళ్లనాటి గొడవ. ఒకనాడు, పాపికొండల్లో, యువరాజులుంగారూ, జక్కులదీవి మండలేశ్వరుల కొమార్త చిత్రాంగీదేవమ్మగారూ వుమ్మడిగా—(అర్ధోక్తి)

రత్నాంగి — అవునవును. జ్ఞాపకం వుంది. అప్పు డది తమరే సెలవిప్పించారు.

సారంగధరుడు— (సుబుద్ధిని విడిచి రత్నాంగికేసీ, రత్నాంగిని విడిచి సుబుద్ధి కేసీ చూస్తూవుంటాడు.)

సుబుద్ధి—అప్పుడు యువరాజులుంగారి హృదయఫలకంమీద ఆమె రూపం లగ్నమయిందా అని నా అనుమానం.

సారంగధరుడు— (చకితుడై మొగం వంచుకుంటాడు.)

రత్నాంగి—ఇది కొత్తసంగతి. అయితే, ఆమె చాలా బుద్ధిమంతురాలనీ, చురుకైనదనీ, త్రిలోకసుందరికూడా అనీ—భద్రాచలం యాత్రకి వెళ్లినప్పుడు, పన్నాలుగేళ్ల పిల్ల అయివుండగా, అత్తయ్యగా రామెని చూసి వున్నారు. తరవాతకూడా వా రామె మాట యెన్నోమాట్లు ఆప్యాయనంగా సెలవిస్తూ వచ్చారు. తమరు సెలవిప్పించిందే నిజమయితే మానాయన చాలా అదృష్టవంతుడే. నేనూ పెట్టి పుట్టినదాన్నే.

సుబుద్ధి — చిత్తం అమ్మా! అప్పుడలా జరిగివుండకపోతే మాత్రం యువరాజులుంగారి మనస్సు ఇప్పటికీ చలించలేదనే నా నిశ్చయం.

రత్నాంగి — నాయనా! వివాహం అంటే పరమపవిత్రం కావడం అలా వుండగా, స్త్రీపురుషుల కదిి విడిపోని శాశ్వత బంధం. అది నసిగా యేర్పడకపోతే తరవాత అనేకచిక్కులు వస్తాయి. మూడుముళ్లూ పడ్డతరవాత యెన్నిప్రాతికూల్యాలు వచ్చినా, భార్యా భర్తాకూడా యెలాగో సరిపుచ్చు

కోవాలి గాని, లేకపోతే తనుపోనీ, లోకనిండా చుట్టుకుంటాయి.

సుబుద్ధి—చిత్తం చిత్తం.

రత్నాంగి—(సారంగధరుడితో) కనక, నాయనా! మర్మం విడిచి నీఅభీష్టం యేమిటో చెప్పవోయ్! నేను అమ్మను కానూ? నా దగ్గిర సిగ్గెందుకు తండ్రీ?

సారంగధరుడు—సుబుద్ధి అయ్యవారికే అనుమానాస్పదంగా వున్న విషయం నేను మనవిచేసుకోడం యెలాగండీ అమ్మా?

సుబుద్ధి—అమ్మగారి ఆజ్ఞ - (అర్ధోక్తి)

సారంగధరుడు — తమ ఆజ్ఞే నాకు శిరోధార్యం. ఇక అమ్మగారి ఆజ్ఞవిషయమై చెప్పడం యెందుకూ? (రత్నాంగితో) అయినా, అమ్మా—(అర్ధోక్తి)

[అప్పుడు గౌరి వస్తుంది.]

గౌరి—అమ్మా! బుల్లిబాబయ్య వచ్చి దర్శనం కోరుతున్నారు.

[అది విని రత్నాంగీ, సారంగధరుడూ, సుబుద్ధీ తటాలున లేచి నుంచుంటారు.]

రత్నాంగి— (లేస్తూ) మరిదిగారే? (సారంగధరుడితో) వెళ్లు నాయనా! బుల్లిబాబయ్యగారిని తోడితెచ్చుకో.

సారంగధరుడు—చిత్తం అమ్మా!

[సారంగధరుడు బయలుదేరి వెడతాడు. సుబుద్ధి ద్వారందాకా వెళ్లి యెదురుచూస్తూ నుంచుంటాడు. గౌరి, యిద్దరు పరిచారికలచేత, రత్నాంగి యెదట, కొంచెం యెడమపక్కగా వున్న స్తంభానికి చేర్చి పరుపూ, బాలీసూ వేయిస్తుంది. ఇంతలో ముందు సారంగధరుడూ, తరవాత విజయాదిత్యుడూ గుమ్మం దాటి వస్తారు. వెంటనే చేతులు కట్టుకుని సుబుద్ధి నమ్రుడవుతాడు. విజయాదిత్యుడి వెనక, చిత్రపటాలు పట్టుకుని వొక పరిచారిక నిలిచి వుంటుంది.]

విజయాదిత్యుడు — (సుబుద్ధితో) తమరూ వున్నారుకదా? దయచెయ్యండి.

సుబుద్ధి — చిత్తం మహాప్రభూ!

[సారంగధరుడూ, సుబుద్ధీ తమతమ ఆసనాల దగ్గిరికి వచ్చి నుంచుంటారు.]

రత్నాంగి—(విజయాదిత్యుడికేసి గంభీరంగానూ, పరీక్షగానూ చూస్తూ, కొత్త ఆసనం చూపించి) దయచెయ్యండి. (నిదానించి) ఏమీ? తమరలా వున్నారేం మరిదిగారూ?

విజయాదిత్యుడు — (తనని చూసుకుంటూ) నాకేమీ? నాలో యేమీ మార్పు లేదే? (రత్నాంగితో) నేను బాగానే వున్నాను వదినా!

రత్నాంగి— లేరు, ఎంతమాత్రమూ లేరు. తమ మొగంమీద వుల్లాసమే కనపడ్డం లేదు. నేనెరిగి వున్నంతలో తమ రెప్పుడూ యిలా లేరు. (సారంగధరుడితో) బుల్లిబాబయ్య నీకెలా కనపడుతున్నారు నాయనా?

సారంగధరుడు — (రత్నాంగితో) తమరు సెలవిచ్చినట్లే బుల్లిబాబయ్య యేదో గాఢమైన విచారంలో వున్నారు. (విజయాదిత్యుడితో) నిజం బుల్లిబాబయ్యా!

విజయాదిత్యుడు — (సుబుద్ధికేసి చూస్తాడు.)

సుబుద్ధి—అమ్మా! మళ్లీ దర్శనం చేసుకుంటాను, ఇప్పటికి సెల విప్పించండి. (లేస్తాడు)

విజయాదిత్యుడు — (సుబుద్ధిని చెయ్యి వూపి నివారిస్తూ) అదేమిా ? తమ రిప్పు డిక్కడ వుండనేవచ్చు. ఇప్పుడు తమరు వినగూడని రహస్యా ల్లేవు సరికదా, తమరున్నూ వినవలసినవే వున్నాయి. నాలో తమకున్నూ మార్పు కనిపిస్తూ వుందా అని—(అర్ధోక్తి)

సుబుద్ధి—చిత్తం మహాప్రభూ ! ఏలినవారు మర్మాంతిక మైన ఆవేదన పడుతున్నట్టే నాకూ కనిపిస్తున్నారు. (కూచుంటాడు.)

విజయాదిత్యుడు— (కళ్లు మూసుకుని నిట్టూర్పు విడుస్తాడు.)

రత్నాంగి— (అది గుర్తించి) సరే, యిక వేరే చెప్పడం యెందుకూ ? నేను నుంచో లేకుండా వున్నాను. నా నరాలు కుంగతీసేస్తున్నాయి. ముందు తమరు దయ చెయ్యండి.

[అందరూ కూచుంటారు.]

విజయాదిత్యుడు—వదినా !

రత్నాంగి—ఏమి సెలవు ?

విజయాదిత్యుడు — అన్నయ్యగారు అబ్బాయికోసం రాజపుత్రికల పటాలు తెప్పించారు. (పరిచారిక చేతిలో వున్న పటాలు పుచ్చుకుని రత్నాంగియెదట వుంచి) వీటిని తమకీ, అబ్బాయికీ చూపించవలసిందనీ, తమ వుభయుల నిష్కృష్టాభిప్రాయాలూ తెలుసుకురావలసిందనీ వారు నాకు ఆజ్ఞాపించారు.

సారంగధరుడు—(చకితుడై రత్నాంగి కేసి చూస్తాడు.)

రత్నాంగి — చాలా సంతోషం. అయితే, నే నిలా అన్నానని తమకు కోపం వద్దు.

విజయాదిత్యుడు—కోపమా ? ఎందుకూ ? సెల విప్పించండి.

రత్నాంగి— ఈ విషయమై తమ బాధ్యత కూడా చాలా గొప్పదే; కాని వారు దూరంగా వుండిపోడానికి కారణం ?

విజయాదిత్యుడు — ఉంది, వదినా ! చాలా పెద్దకారణమే వుంది.

రత్నాంగి — పోల్చుకో లేకుండా వున్నాను. చిత్రపటాల విషయమై నిన్న వుదయం చాలా కలివిడిగానే మాట్లాడారు; కాని నిన్న రాత్రి వారి దర్శనం కాలేదు. ఇవాళ ఉదయం రాజకార్యాలలో ప్రవృత్తులై యిక్కడికి దయచెయ్యనే లేదు. సరే, వారిప్పు డీవిషయమై నాతో మాట్లాడ్డానికే యిష్టపడ్డం లేనట్టు స్పష్టమే కదా ? ఇలాంటి స్థితిలో ఆకారణం గొప్పదే అని వేరే చెప్పాలా? ఏమయినా, తప్పదు కనక, అదేదో సెల విప్పించండి.

విజయాదిత్యుడు — (చేతులు జోడించుకుని సవినయంగా) నేను తమ బిడ్డవంటి వాణ్ణి. అన్నయ్యగారి ఆజ్ఞా, అక్కడి వార్తా తమతో మనవిచేసుకోడమే నాపని. నన్న న్యథా భావించవద్దని మరీమరీ వేడుకుంటున్నాను.

[సారంగధరుడూ, సుబుద్ధీ నిర్విణ్ణులై ఒకరి నొకరు చూసుకుంటారు.]

రత్నాంగి — పురుషసింహులైన తమర్నే అంత కదిలించేస్తూ వున్న ఆవిషయం

నన్నెంత ఆరాటపెడుతుందో. అయినా సరే సెలవుదయచెయ్యండి.

విజయాదిత్యుడు — (పటాలు నిర్దేశిస్తూ) ఇవి అరవైపటాలు. అయితే, వీటిలో తమరూ, అబ్బాయీ పరిశీలించవలసినవి యాభైతొమ్మిది మాత్రమే. ఒకటి తమరు చూడవచ్చు; గాని అది ప్రత్యేకించబడ్డది.

రత్నాంగి — ఎందుకోసం?

విజయాదిత్యుడు — ఆపటం మెవరిదో ఆరాజపుత్రికను అన్నయ్యగారు— (తలవంచుకుని) వరించారు వదినా!

సారంగధరుడు — (చకితు డవుతాడు.)

రత్నాంగి — (చెవులు మూసుకుని) శివశివా!

సుబుద్ధి—హరహరా! విధివైపరీత్యం!

విజయాదిత్యుడు — ఇలాంటి వార్త మోసుకు వచ్చినందుకు నేను సిగ్గుపడుతున్నాను. తమయెదటికి రాలేక రాలేక విధిలేక వచ్చాను. ఈ సంగతి నాతో సెలవివ్వడానికి అన్నయ్యగారికి మొగం చెల్లలేదు.

రత్నాంగి — తమతో మరెవరు సెలవిచ్చారూ?

విజయాదిత్యుడు—గుమ్మం దిగాటప్పటికి మహారుద్రయ్యగారు వచ్చి వూదారు.

రత్నాంగి — వారిని మహారాజే పంపారు.

సుబుద్ధి—ఈ పన్నగడే మహారుద్రయ్యగారి దని నా వుద్దేశం మహాప్రభూ! మహారాజులుంగారి అనుగ్రహం తప్పిపోకుండా వుండడానికి వా రెప్పుడూ యిలాంటి యెత్తులే వేస్తున్నారు.

విజయాదిత్యుడు—అవునవును. తమ వూహ సుసంగతంగానే వుంది. నర్మ సచివులని మహారుద్రయ్యగారికి పేరేకదా?

సారంగధరుడు— ఇది మహారుద్రయ్యగారి పన్నుగడ అయినా, బాబయ్యగారికి స్వయంభువు అయినా పర్యవసానం వొకటే; కనక బుల్లిబాబయ్యా! ఆరాజపుత్రిక పేరు న్నూ— (అర్ధోక్తి)

రత్నాంగి — అబ్బాయి చెప్పింది బాగానే వుంది. సెల విప్పించండి.

విజయాదిత్యుడు—జకుల దీవి— (అర్ధోక్తి)

[ పిడుగు పడ్డట్టయి సారంగధరుడు మొగం వంచుకుంటాడు. మొగం కప్పుకుని రత్నాంగి "హా—య్యో" అంటూ కుంగిపోతుంది. "హరహరా! హరహరా" అంటూ సుబుద్ధి చెవులు మూసుకుంటాడు.]

విజయాదిత్యుడు— (తెల్లపోయి సుబుద్ధితో) తమ ధోరణి చూడగా నా కేదో మహావైపరీత్యం స్ఫురిస్తోంది.

రత్నాంగి — అవును. తమరు సరిగానే గ్రహించారు.

విజయాదిత్యుడు—వివరంగా వినకోరుతున్నాను.

రత్నాంగి— అరవైయేళ్లు నిండనున్న మహారాజు ఒక నవోఢను వరించినందుకూ, యాభైయేళ్ల వయస్సున నాకు సవతి దాప

రిస్తూ వున్నందుకూ నాకేమీ విచారం లేదు. ఈకారణంవల్ల వారిని అల్లరిపెట్టి నేను నలుగురి నోళ్లలోనూ పడ్డమూ మంచిది కాదు; కాని, మహారాజు కోడలిమీద కన్ను వేశారు.

విజయాదిత్యుడు—(ఉలిక్కిపడి, హీనస్వరంతో) అం-టే?

సుబుద్ధి — (ఒక్కమాటు రత్నాంగి కేసి చూసి, తరవాత విజయాదిత్యుడితో) తరవాతి సంగతి నేను మనవి చేసుకుంటాను మహాప్రభూ! తమరు దయచేశాటప్పటికి అమ్మగారితో నే నీ విషయమే మనవిచేసుకుంటున్నాను. మరేమీ లేదు, యువరాజులుంగారు జక్కులదీవి రాజపుత్రిక చిత్రాంగీదేవమ్మగారిమీద మూడేళ్లుగా మరులుగొని వున్నారు.

సారంగధరుడు—(సుబుద్ధికేసి పులుకూ పులుకూ చూస్తాడు.)

విజయాదిత్యుడు— (ఆవేశంతో) హరహరా! ఏమి దుష్కాలమూ! ఎంత అసుర సంకల్పమూ! ధోరణి చూడగా చళుక్యవంశానికి నే డేదో దారుణ మైన అపాయం కనిపెట్టుకుని వున్నట్టుంది. సూర్యచంద్రుల గతులు తప్పేటట్టూ వుంది. వైదికధర్మం విలుప్త మయిపోయే సూచనలు కనపడుతున్నాయి.

సారంగధరుడు—(గంభీరంగా చూస్తూ) బుల్లిబాబయ్యా! ఇప్పు డంత ప్రమాదం యేం వచ్చిందీ? తమ రంత బెంబేలుపడిపోవలసిన సన్నివేశమున్నా యేమి తటస్థపడ్డదీ?

రత్నాంగి—అయ్యో, అయ్యో! (విజయాదిత్యుడికేసి చూస్తుంది.)

సారంగధరుడు—అమ్మా! తమరు నా మనవి చిత్తగించ కోరుతున్నాను. రాజకుటుంబాలలో బహుపత్నీకత్వం సర్వసాధారణ మైన విషయం. అది అనేక కారణాల వల్ల తటస్థపడుతుంది. ఇప్పుడు బాబయ్యగారి వివాహం తలపెట్టా రంటే జటిలమైన రాజకీయపు ఉద్దేశ్యమేదో యిందులో నిగూఢమయివుందని మనం గుర్తించాలి. కాని, కేవలమూ యింద్రియలోలత్వంవల్ల వారిందుకు సిద్ధపడుతున్నా రని నిశ్చయించుకోగూడదు.

సుబుద్ధి—(సారంగధరుడితో) చిత్రాంగీదేవమ్మగారి విషయమై తమరు— (అర్ధోక్తి)

రత్నాంగి—(సుబుద్ధితో) క్షణం కిందటి దాకా ఆమె పేరు చెబితే యెంతో గాంభీర్యం నటించిన నాయన యెంతలో యెలా మారిపోయాడో చిత్తగించారా? (విజయాదిత్యుడితో) వెర్రితండ్రి! అదీ ధోరణి!

విజయాదిత్యుడు— కనకనే అన్నయ్యగారి కలాంటి సాహసం కలిగింది. (సారంగధరుడితో) బాబూ! నువ్వు చెప్పింది సరే అని వొప్పుకుందాం. అయితే, కోడలిమీద కన్ను వెయ్యడం—(అర్ధోక్తి)

సారంగధరుడు—తెలిసే వా రలా చేస్తున్నా రనడానికి మన కాధారం యేమిటీ?

విజయాదిత్యుడు— తెలిస్తే ఆ కోరిక మళ్లించుకోవలసిందే కాదూ?

సారంగధరుడు— సుబుద్ధి అయ్యవారి వూహ నమ్మెయ్యడ మేనా తమరు?

రత్నాంగి — (సుబుద్ధితో) ఆలకించారా?

విజయాదిత్యుడు — పోనీ, సుబుద్ధి అయ్యవారి మాట అలా వుంచు. నిజం చెప్పు. ఆమెని నువ్వు— (అర్థోక్తి)

సుబుద్ధి — (తర్జనితో టోకాయిస్తూ) అబ్బా అడగండి మహాప్రభూ!

సారంగధరుడు—(సుబుద్ధితో) ఆమాట తమరూ అడగవచ్చు. (విజయాదిత్యుడితో) ఆమె తల్లిగా రవుతా రంటేనే నాహృదయాని కాహ్లాదంగా వుంది బుల్లిబాబయ్యా!

రత్నాంగి— శివా! శివా!

సుబుద్ధి— నే నంగీకరించను. (సారంగధరుడితో) ఆ వేళ నేను తమ సన్నిధిని లేనను కున్నారా? తమరూ, ఆమే చూసుకున్న చూపులు నే నర్థంచేసుకోలే దనుకున్నారా?

సారంగధరుడు—(సుబుద్ధితో) అయితే, నాచూపుల అర్థం నాకు తెలవ దంటారా తమరు? వాటికి ప్రేరక మైన నాచిత్తవృత్తి యెలాంటిదో నాకు తెలవనే తెలవ దంటారా తమరు? నామనస్సుకి తమ రేమి ఆరోపించినా నాబుద్ధి అంగీకరించితీరా లంటారా తమరు?

రత్నాంగి— (సుబుద్ధితో) ఇక మన మేమి చెప్పగలమూ?

సుబుద్ధి — (విజయాదిత్యుడితో) ఆ తర్కం యెవ రందుకోగలరు మహాప్రభూ?

సారంగధరుడు — (సుబుద్ధితో) మనకి తర్కం యెందుకూ యిప్పుడూ? బాబయ్య గారి నిశ్చయం పూర్వపక్షం చేసెయ్యా లని ప్రయత్నం మాత్రం యెందుకూ మనకి? (విజయాదిత్యుడితో) అమ్మగారికీ, తమకూ నేను ధర్మాలు చెప్పగలవాణ్ణా బుల్లిబాబయ్యా? కాని బాబయ్యగారి స్థితిగతులు మనం కొంచెం యోచించుకోవాలి. వారు చతుర్వేదాలూ అభ్యసించారు. షట్ఛాస్త్రాలూ పఠించారు. సకలపురాణేతిహాసాలూ క్షుణ్ణంగా పరిశీలించారు. తమ సర్వజ్ఞతకీ, ధర్మనిరతికీ వినియోగంగా, గురుదేవులవారి చేత, పంచమవేద మైన మహాభారతం తెనుగుచేయిస్తున్నారు—(అర్థోక్తి)

విజయాదిత్యుడు— ధర్మాలు తెలుసుకోవడం సులభమే.

సారంగధరుడు — ఎంతమాత్రమూ కాదు. సామాన్యధర్మాలూ, విశేషవిధులూ కార్యాచరణలో సమన్వయపరుచుకోడం మహామహులకున్నూ వొక్కొక్కప్పుడు తలప్రాణం తోకకు తెస్తూ వుంటుంది.

విజయాదిత్యుడు—ధర్మచింత వుంటేను.

సారంగధరుడు — ధర్మం తెలవడం అంటే బుద్ధికి సంస్కారం కలగడం కాదా బుల్లిబాబయ్యా?

సుబుద్ధి— అయితే, యిది మహారాజులుంగారికి విశేషవిధికి సంబంధించిన ధర్మాచరణం అనా తమ నిర్వచనం?

సారంగధరుడు— ముమ్మాటికీనీ. ఇది చిత్తగించారా? బాబయ్యగారి వయస్సా, వివాహయోగ్యం కాదు. ఇప్పటి సందర్భమా, జనసమ్మత మైనది కాదు. (పటాలు చూపిస్తూ) ఈరాజపుత్రికలా, వారికి పరిగ్రాహ్యాలు కారు. ఇలాగ, యీకారణాలలో

వాళ్ళెక్కువ వారిని దిగ్భ్రాంతులను చేసె య్యే గలిగినవి. కాని యివన్నీ యోచించుకో కుండా బాబయ్యగా రిందుకు సిద్ధపడుతున్నా రనా తమ అభిప్రాయం? తమరు కొంచెం సావధానంగా యోచించండి. అత్యంత క్లిష్టా లైన సన్నివేశా లేవో కొన్ని వారిని ముట్ట డించాయి. వాటిని సరిపుచ్చుకోడానికే— (అర్ధోక్తి)

విజయాదిత్యుడు— బాబూ! నువ్వు వెయ్యి చెప్పు లక్ష చెప్పు, యిందులో యింద్రియలోలత్వం తప్ప మరేమీ లేదు. మహారుద్రయ్యగారి ప్రోత్సాహం తప్ప దీనికి ప్రేరకమైన రాజకీయపు శుత్తున్నూ లేదు.

రత్నాంగి—అదీ మాట.

సారంగధరుడు—(రత్నాంగి కేసి చూసి పూరుకుంటాడు.)

రత్నాంగి—కాకపోతే, ఈ పటాలకు చెందిన రాజపుత్రికలను విడిచి మరో పది మందిని పెళ్లాడమను, నా అభ్యంతరం లేదు.

విజయాదిత్యుడు—ఏం, అది బాగుందా?

సారంగధరుడు—(నిరుత్తరుడై మొగం వంచుకుంటాడు.)

సుబుద్ధి—(సారంగధరుడితో) అయితే, యిప్పుడు కర్తవ్యం యేమిటనీ తమవుద్దేశం?

సారంగధరుడు—బాబయ్యగారి వివాహ ప్రయత్నమే.

రత్నాంగి— (ఉలిక్కిపడుతుంది.)

విజయాదిత్యుడు—అలాగ వొక్కనాటికీ కాదు. తమ అభిప్రాయం యేమిటి వదినా?

రత్నాంగి— నే నేమీ చెప్పలేను. నాకు మతి పోతోంది. ఏంచేసినా తమరూ, గురుదేవులూ, చిట్టివీరన్నగారూ--(అర్ధోక్తి)

విజయాదిత్యుడు—ముందు అన్నయ్య గారికి నే నేమిటీ చెప్పడం?

[అందరూ సారంగధరుడికేసి చూస్తారు.]

సారంగధరుడు — దీని కింత ఆలోచన యెందుకు బుల్లిబాబయ్యా? తండ్రీకొడుకు లకు ఏకకాలంలో వివాహం అశాస్త్రీయం. లోకమున్నూ హర్షించదు వివాహం విష యమై బాబయ్యగారికే గాని నా కిప్పుడు తొందరలేదు. ఈసంగతి వారితో విన్న వించి, వుపయోగించవలసిం దని పటాలు కూడా వారికే సమర్పించండి.

విజయాదిత్యుడు — (రత్నాంగి కేసి చూస్తాడు.)

రత్నాంగి — (సారంగధరుడికేసి చూ స్తుంది)

సారంగధరుడు — (రత్నాంగితో) తమరు నామనవి ఆలించండి. ఇది యిలా జరిగిపోవలసిందే.

రత్నాంగి—(విజయాదిత్యుడితో) ఇక లాభం లేదు. అబ్బాయి కేదేనా తోచకే పోవాలి; కాని తోస్తే అది అలా జరగవల సిందే. ఈమాటలే వారితో విన్నవించండి. ఏమాత్రమేనా తరవాయి వుంటే, చెరకాకు బల్లే లయి యివేనా వారి కావేదన పుట్టించ వచ్చు.

సుబుద్ధి — అమ్మగారు సెలవిచ్చింది బాగుంది. అలా చేయించండి మహాప్రభూ!

విజయాదిత్యుడు--అన్నయ్యగారిప్పుడు కామజ్వరపీడితులై వున్నారు. వారికిదేమీ తలకెక్కదు.

[అందరూ లేస్తారు.]

రత్నాంగి — మరిదిగారూ, ఒక్క మనవి.

విజయాదిత్యుడు -- ఏమి సెలవు?

రత్నాంగి — అబ్బాయి నా కేకసంతానం. ఇప్పటిమట్టుకి వారికీ అంతే. అతనేనా లేక లేక కలిగాడు. ఎన్నో వ్రతాలు చెయ్యగా, ఎన్నో తీర్థక్షేత్రాలు సేవించగా, ఎందరో సాధువులను కొలవగా పుట్టుకు వచ్చాడు నాయన. అతను చెప్పినట్టు వివాహానికిప్పుడేమంత తొందర లేదు. ఇక వున్నదల్లా నా కొక్కటే కోరిక. (చేతులు జోడించుకుని) అతను మహారాజు కడుపున పుట్టాడు. జ్యేష్ఠుడుకూడా అతనే అవుతాడు. కనక నాయనకి రాజ్యాధిపత్యం తప్పిపోకుండా — (అర్థోక్తి)

సారంగధరుడు—(రత్నాంగితో) తమదంతా వెర్రండీ అమ్మా!

విజయాదిత్యుడు —వదినా! ఇంతకింతయింది కదా? ఇక భవిష్యత్తా? దానిమాట యిప్పుడు కాదు (సుబుద్ధితో) వెంటనే తమరింటికి దయచేసి, సంగతంతా విన్నవించి, దీపాలు పెట్టాక బాబయ్యగారిని ఒక్కమాటిక్కడికి పంపండి.

రత్నాంగి—తమరూ దయ చెయ్యండి నాయనగారూ!

సుబుద్ధి— చిత్తంమహాప్రభూ, చిత్తం అమ్మగారూ!

విజయాదిత్యుడు—వదినా, సెలవు

రత్నాంగి—చిత్తం, సెలవు.

సారంగధరుడు — బుల్లి బాబయ్యా! సెలవు. (గిర్రున తిరిగి లోపలికి వెళ్ళిపోతాడు.)

[రత్నాంగీ, విజయాదిత్యుడూ, సుబుద్ధీ అతను వెళ్లిన దిక్కుగా చూస్తారు. తరవాత, ముందు విజయాదిత్యుడూ, పటాలు పుచ్చుకుని వెనకాలనుపరిచారికా, తల వంచుకుని పిమ్మట సుబుద్ధీ వెళ్లిపోతారు. రత్నాంగి సారంగధరుడు వెళ్లిన వేపుకి చూస్తుంది]

